క్లుప్తంగా

బూతువాది శతకం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణం అక్షర స్కూల్ సమీపంలోని కేయస్ఆర్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో శ్రీ లలితకళాసేవా సంస్థ ఆధ్వర్యంలో కవి సవ్వప్పగారి ఈరన్న రచించిన 'బూతువాది శతకం' పుస్తకావిష్కరణ సభ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నటరాజుస్వామి అధ్యక్షత వహించి మాట్లాడారు. కవి ఈరన్న రచించిన 'బూతువాది శతకం' ఎంతో గొప్పదని హేతువాదులకు ఇది చెంపపెట్టు అని ఇలాంటి రచనల వల్ల హైందవధర్మం నిలుస్తుందని చెప్పారు. వక్తలు మాట్లాడుతూ పరధనాన్ని స్వీకరించి పరధర్మాలను స్వీకరించడం తగదని, మన హైందవ ధర్మం ఎంతో గొప్పదని వేదోపనిషత్తులు పురాణేతిహాసాల్లో ఎన్నో ధర్మాలు ఉన్నాయని, వాటిని పాటించాలన్నారు. అనంతరం కవి సవ్వప్పగారి ఈరన్నను శాలువా పూలమాలలతో సత్కరించారు. సాహితీవేత్తలు ప్రతాస్వామి, లక్ష్మన్నయాదవ్, గోపాల్, ఆంధ్రో పన్యాసకులు డా.నల్లారెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ బస్సు బోల్తా



రోడ్డు పక్కన వరి మడిలో బోల్తాపడిన స్కూల్ బస్సు

కోసిగి: మండల పరిధిలో తుంబిగనూరు గ్రామ సమీపంలో స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు ప్రక్కనున్న వరి మడిలో బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మంత్రాలయంలోని శ్రీ వైష్ణవి స్కూల్‌కు చెందిన బస్సు మంగళవారం ఉదయం బడి పిల్లలను ఎక్కించుకునేందుకు బయలు దేరి వెళ్లింది. ఆ బస్సు మంత్రాలయం నుంచి తుంగభద్ర, తుంబిగనూరు గ్రామాల మీదుగా సాతనూరు వరకు వెళుతుంది. ఆయా గ్రామాలలోని పిల్లలను ఎక్కించుకుని మంత్రాలయంలోని స్కూల్‌కు చేరుకుంటుంది. అయితే మంగళవారం ఉదయం పిల్లలను ఎక్కించుకునేందుకు వెళుతున్న సమయంలో తుంబిగనూరు సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కనున్న వరి పొలంలో బోల్తా పడింది. అందులో పిల్లలు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ మాత్రం స్వల్పగాయాలతో బయట పడ్డాడు. పొలంలో బోల్తా పడిన బస్సును జేసీబీతో బయటకు తీశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న ఎస్‌ఐ కిరణ్‌బాబు

మంత్రాలయం: కర్ణాటక రాష్ట్రం గిల్లెసూగూరు క్యాంపు గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని మాధవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కిరణ్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం తుంగభద్ర నదీ తీరంలో మద్యం అక్రమ రవాణాదారులపై పోలీసులు దాడులు చేపట్టారు. కాచాపురం గ్రామానికి చెందిన బోయ రాము నదీతీరంలోని హనుమప్ప ఆలయం వద్ద మద్యంతో పట్టుబడ్డారు. నిందితుడి నుంచి 480 ఒరిజినల్ చాయిస్ మద్యం టెట్రా ప్యాకెట్లు (90 మీ.లీ.) స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు. దాడుల్లో కానిస్టేబుళ్లు వీరాంజినేయులు, సోమశేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలో రైల్వేస్టేషన్ వద్ద ఇద్దరు వ్యక్తులు మంగళవారం కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ తెలిపారు. వారి నుంచి 9 బాక్సుల మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కర్ణాటక మద్యం సరఫరా జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఎన్‌ఏఎస్‌తో నాణ్యమైన విద్య

కౌతాళం: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్)తో నాణ్యమైన విద్య అందించవచ్చని మండల విద్యాధికారి-2 శోభరాణి అన్నారు. ఎన్‌ఏఎస్ ఎగ్జామ్ కోసం ప్రధానోపాధ్యాయులు, ఇన్విజిలేటర్లకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేందుకు కౌతాళంలోని నారాయణ్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థులను ఇన్విజిలేటర్స్‌గా తీసుకున్నామని వీరితో పాటు ప్రధానోపాధ్యాయుల్ని తీసుకున్నట్లు తెలిపారు. ఈనెల 3వ తేదీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వ ప్రాధాన్యత



మంత్రాలయంలో ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



ఆదోనిలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి రక్త పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

మంత్రాలయం: ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మంత్రాలయం సచివాలయం-1లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం కోసం సీఎం జగనన్న సువర్ణ పాలన సాగిస్తున్నారని వివరించారు. అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, మనబడి నాడు-నేడు, విద్యాకానుక తదితర పథకాలతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ప్రజారోగ్య పరిరక్షణకు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, 108, 104 అంబులెన్స్, తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ప్రవేశపెట్టిన ఘనత జగనన్నకే చెల్లిందన్నారు. నిత్యం ప్రజలకు సేవ చేయాలన్న తపన సీఎం జగనన్నకు ఉంటే ప్రజాధనాన్ని దోచుకుని అవినీతి ఆరోపణలతో మాజీ సీఎం చంద్రబాబు జైలు పాలైనట్లు చెప్పారు. ఎవరెన్ని కుట్రలు కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు.

మంత్రాలయం అభివృద్ధికి కృషి

మంత్రాలయం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రూ.3 కోట్లతో జల జీవన్ మిషన్ కింద పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి పనులు చేపట్టామన్నారు. రాఘవేంద్రనగర్, శ్మశాన వాటిక, నదీ తీరానికి సీసీ రోడ్లు వేశామన్నారు. అగ్రి ల్యాబ్‌తో పాటు మూడు రైతు భరోసా కేంద్రాలు, రెండు సచివాలయాలు, మూడు హెల్త్ క్లినిక్ సెంటర్లు నిర్మించామని వివరించారు. పట్టణంలో ఇప్పటికే 900 మందికి పైగా ఇంటి పట్టాలు ఇచ్చామని తెలిపారు. మిగతా వారి కోసం త్వరలోనే మరింత భూమి కొనుగోలు చేసి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్న జగనన్నను రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. వైద్యాధికారిణి డాక్టర్ గోవిందమ్మ, సురేష్, వైద్య నిపుణులు రవీంద్రదీపక్, శివశంకర్ గౌడ్ శిబిరానికి వచ్చిన ప్రజలకు చికిత్సలు చేపట్టారు. 418 మందికి చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, ఎంపీడీఓ మణిమంజరి, తహశీల్దార్ దేవ చంద్రశేఖర్, సీడీపీవో నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిటౌన్: ప్రజారోగ్యమే మహాభాగ్యమని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 37వ వార్డు షరాఫ్‌బజార్ అర్బన్‌హెల్త్ సెంటర్ ఆవరణం, 31వ వార్డు మరాఠీవాడికి సంబంధించి స్థానిక వీరశైవ కళ్యాణ మండపంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహించారు. ఆయా శిబిరాలను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్ రెడ్డి తదితరులు సందర్శించారు. శిబిరంలోని ఏయే డాక్టర్ ఏయే వైద్యసేవలు అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. కొన్ని వంటకాలను ఎమ్మెల్యే రుచి చూశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మాతాశిశు సంరక్షణ, తల్లీ బిడ్డ ఆరోగ్యం, పౌష్టికాహారం తీసుకునే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు.



వల్లూరులో వృద్ధురాలికి కళ్లద్దాల పంపిణీ



మంత్రాలయంలో గర్భిణులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కౌతాళం: ప్రజలకు తక్షణ వైద్య సేవల కోసం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు, గ్రామ ఇన్‌చార్జ్ మరేగౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం 21వ రోజు చివరి హెల్త్ క్యాంపును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందించేలా చర్యలు చేపట్టారని వివరించారు. సురక్ష వైద్య శిబిరాల్లో ప్రతి రోగికీ వైద్యం అందుతుందని తెలిపారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డుల్ని, కంటి అద్దాలను పంపిణీ చేశారు. గ్రామస్తులు 392 మంది క్యాంపు వద్దకు తరలివచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకోగా ఇందులో ఐదుగురికి మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసినట్లు తెలిపారు. డాక్టర్లు నజీర్‌అహ్మద్, సుజాత, మౌనిక, వెంకటేశ్వర్లు, నాయకులు వెంకటరామిరెడ్డి, ఈశప్పగౌడ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకుల ఎదుగుదలకు కృషి



ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న వాల్మీకి వర్గీయులు

మంత్రాలయం: వాల్మీకుల సామాజిక, రాజకీయ ఎదుగుదలకు వైఎస్సార్‌సీపీ కృషి చేస్తోందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి రాంపురం గ్రామంలో వాల్మీకి పెద్దలు ఎమ్మెల్యేతో భేటీ అయ్యారు. మండల కేంద్రంలో వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు సహకారం అందించిన ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అత్యధికంగా వాల్మీకులు ఉన్నారని గుర్తు చేశారు. వాల్మీకుల సహకారంతో ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు గెలుపొందడం జరిగిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సైతం వాల్మీకులకు మంచి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మంత్రిగా, ఎమ్మెల్సీగా డాక్టర్ మధుసూదన్, కర్నూలు కార్పొరేషన్ మేయర్‌గా బీవై రామయ్య, గ్రంథాలయ చైర్మన్‌గా సుభాస్ చంద్రబోస్‌కు పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోనూ ఎంతో మంది వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులుగా ఉన్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, నాయకులు జిమ్మి, వీరేష్, రామాంజినేయులు, వాల్మీకి యువకులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

కోసిగి: విజయనగరం జిల్లాలో జరిగిన రైల్వే ప్రమాదంలో అగసనూరు గ్రామానికి చెందిన చాకలి తాయప్ప (21) అనే యువకుడు మృతి చెందిన విషయం విధితమే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌ఛార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి యువకుడి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఓ కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగం కోసం వెళ్లి రైలు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. కుటుంబంలో చేతికొచ్చిన పెద్ద కుమారుడు ఉద్యోగం కోసం వెళ్లి తిరిగిరాని లోకానికి వెళ్లడం తీరని శోక సంద్రం మిగిల్చింది. ఆ కుటుంబానికి ఎళ్ల వేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసానిచ్చారు.

రాజకీయ ఉనికి కోసమే టీడీపీ నిందారోపణలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: ఉమ్మి ఖబరస్తాన్ చూసుకో.. హిందూ శ్మశానవాటికేలా అంటూ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి టీడీపీకి చెందిన నాయకుడు ఉమ్మి సలీంకు సూచించారు. రాజకీయ ఉనికి కోసమే ఎమ్మెల్యే, ప్రభుత్వంపై నిందారోపణలు చేయడం పనిగా పెట్టుకున్నావా అంటూ ప్రశ్నించారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, అధ్యక్షులు దేవా, కౌన్సిలర్ రామలింగేశ్వరయాదవ్ మాట్లాడారు. రెండు రోజుల క్రితం మైనార్టీ వర్గానికి చెందిన ఉమ్మి సలీం హిందూ శ్మశానవాటిక అభివృద్ధిపై లేనిపోని నిందారోపణలు చేశారని ఎమ్మెల్యే చెప్పారు. 2015-16లో రూ.1.90 లక్షలు, రెండో విడత కింద రూ.90 వేలు నిధులు మంజూరుకాగా వాటితో శ్మశానవాటికలో తాగునీటి వసతి, గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 2020-21లో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.78 లక్షలు మంజూరు కాగా వాటితో క్లైయిమ్ టోరియం (శవాలను దహనం చేసే పేటిక) పనులు చేపట్టేందుకు అనుమతులు లభించాయన్నారు. మంజూరైన నిధులతో 18 కాలమ్స్, ఫౌండేషన్ చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ గోవర్ధన్ రెడ్డి రూ.20 లక్షల మేర ఖర్చు చేశారు. అంతలో కరోనా వ్యాపించడంతో క్లైయిమ్ టోరియం ఏర్పాటుకోసం మంజూరు చేసిన రూ.78 లక్షలను కరోనా నివారణకు బదిలీ చేస్తూ పనులను నిలిపివేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయన్నారు. దీంతో నిధులు విడుదలగాకపోవడం వల్లనే శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టలేకపోయామే తప్పా అందులో ఎవరికీ ఒక్క రూపాయి కూడా అందలేదని వివరించారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన ఉమ్మి సలీం శ్మశాన అభివృద్ధి కోసం మంజూరైన నిధులను కాజేసి, పనులకు ఎగనామం పెట్టారని నిందారోపణలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. లేనిపోని ఆరోపణలు చేయడం తగదని, పూర్తి వివరాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు.

నేడు మదిరెలో గడప గడపకు మన ప్రభుత్వం

ఆదోనిరూరల్: మండలంలోని మదిరె గ్రామంలో బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ గీతావాణి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొంటారని, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి



రక్తదానం చేస్తున్న డీఎస్పీ శివనారాయణ స్వామి దంపతులు

ఆదోనిఅర్బన్: విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకుందామని డీఎస్పీ శివనారాయణస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం డీఎస్పీ శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం ముగింపు సందర్భంగా స్థానిక అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో డీఎస్పీ దంపతులు రక్తదానం చేశారు. అంతేగాకుండా సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసులు, సిబ్బంది, అధికారులు రక్తదానం చేసి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం అక్టోబర్ 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించడం జరిగిందన్నారు. మంగళవారం ముగింపు సందర్భంగా పట్టణంలో సబ్‌డివిజన్ పోలీసులు రక్తదానం చేశారన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలు ఓపెన్‌హౌస్, ఎస్సే రైటింగ్ కాంపిటిషన్, ర్యాలీలు, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని, యాక్సిడెంట్లు, గర్భిణులు, ఆపదలో ఉన్న వారికి ఈ రక్తం ఎంతో అవసరం పడుతుందని వివరించారు. సీఐలు విక్రమసింహా, శ్రీనివాసనాయక్, నరసింహరాజు, నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు



కూలీలతో మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ

కౌతాళం: మండలంలోని వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఇబ్బందులు పడకుండా ఉన్న గ్రామాల్లోనే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లోకేశ్వర్ అన్నారు. మండల పరిధిలోని మదిరే గ్రామంలో మంగళవారం ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, ముఖ్యంగా ఉపాధి కూలీలు వలస వెళ్లకుండా అన్ని చర్యలు చేపట్టిందన్నారు. అలాగే మండలంలోని రైతులు బోర్ల కింద పండ్ల తోటల సాగు చేపడితే తగిన ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తామన్నారు. తక్కువ పెట్టుబడితో మునగ పంట సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. నీటి నిల్వ కోసం ఫారంపాండ్ తవ్వకాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కూలీలు వలస వెళ్లకుండా గ్రామంలో చేపట్టే ఉపాధి పనులను సద్వినియోగంచ చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ సుబ్బారాజు, ఏపీఓ జుబేర్ అహ్మద్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



ఆదోనిలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదోనిరూరల్: ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆదోని పట్టణంలో ఆ యూనియన్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న, వై.టి.భీమేష్, ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గురుదాసుగుప్తా 4వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మరాఠీగేరి కాలనీలో ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు షేక్షావలి, ఆదోని మార్కెట్‌యార్డులో ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న, తిమ్మారెడ్డి సర్కిల్‌లో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు టి.వీరేష్, సూపర్‌బజార్లో హమాలీ యూనియన గౌరవాధ్యక్షులు కల్లుబావిరాజు, ప్రభాకర్ టాకీస్ వద్ద ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓ.బి.నాగరాజు, తిక్కస్వామి దర్గా సర్కిల్‌లో సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, ఆర్టీసీ డిపో వద్ద ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ఏఐటీయూసీ పతాకాన్ని ఎగురవేశారు. వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం భారతదేశంలో మొట్టమొదటి సారిగా 1920 అక్టోబర్ 31వ తేదీన ఏఐటీయూసీ ఏర్పడిందన్నారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు



ఆదోనిలోని ఓ హోటల్‌లో ఆహారాన్ని తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారి రాజగోపాల్

ఆదోనిఅర్బన్: పట్టణంలోని హోటళ్లపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్ ఆధ్వర్యంలో దాడుల్లో చేపట్టి హోటళ్లలో కాలం చెల్లిన తినుబండారాలు, శుభ్రత లేకపోవడం, నాణ్యత లేని ఆయిల్, సరుకులు తదితర వాటిని పరిశీలించారు. ఏడు హోటళ్లపై తనిఖీలు చేయగా, వెల్‌కమ్ హోటల్‌కు రూ.3 వేలు, ఉషా స్టార్ హోటల్‌కు రూ.2 వేలు, గోబీ ఫాస్ట్‌ఫుడ్ హోటల్‌కు రూ.2 వేలు జరిమానా విధించడంతో పాటు మధురిమ బార్ అండ్ రెస్టారెంట్‌లో కాలం చెల్లిన ఆహారంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా మాతాశ్రీ హోటల్ నుంచి భోజన శ్యాంపిల్ తీసుకున్నట్లు చెప్పారు. హోటళ్లలో శుభ్రత పాటించకపోయినా, కాలం చెల్లిన ఆహారాన్ని ప్రజలకు అందిస్తున్నా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి హోటళ్లపై ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చని, వారి పేర్లను గోప్యంగా ఉంచి హోటల్‌లో తనిఖీలు చేస్తామని తెలిపారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, సిబ్బంది ఉన్నారు.

3న ఆదోనిలో జాబ్‌మేళా

ఆదోనిరూరల్: ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 3వ తేదీన ఉదయం 9 గంటలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీటీఈసీ ప్రయివేట్ లిమిటెడ్, ఆస్ట్రోస్టీల్, ఎన్ఎస్ ఇన్‌స్టుమెంట్స్, మీటు బాష, అమర్‌రాజా గ్రూప్స్, శ్రీరామ్ చిట్స్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎస్‌కే బయో ఎంటర్‌ప్రైజస్, రేడియట్ సెల్కాన్ ఎలక్ట్రికల్ ప్రైవేట్ లిమిటెడ్, నవభారత్ ఫర్టిలైజర్ లిమిటెడ్, ఫ్లిప్‌కార్ట్, ఏజీటీఆర్ఎస్ ఐడీఏఆర్టీ ప్రైవేట్ లిమిటెడ్, జీఎంఆర్ ఎకో అల్యూమినియం ప్రైవేట్ లిమిటెడ్, ఆటో సెన్స్ కంపెనీలో 640 ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మిషన్ ఆపరేటర్స్, అసెంబ్లింగ్ ఆపరేటర్, టెక్నీషియన్ ప్రాసెస్ అసోసియేట్, మిషన్ ఆపరేటర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ప్రొడక్షన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, డెలివరీ బాయ్స్, సీనియర్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్, సెక్యూరిటీ గార్డ్స్, వాయిస్ ప్రాసెస్ తదితర ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18-45 ఏళ్ల వయస్సు గల వారు అర్హులని చెప్పారు. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.10 వేల నుంచి రూ.28,200 వరకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీటీఎఫ్ సభ్యత్వ నమోదు



డీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

కోసిగి: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరెకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్, రామన్న కోరారు. మంగళవారం కోసిగి మండలంలోని పల్లెపాడు, దుద్ది, డి.బెళగల్, చిన్నభూంపల్లి, సాతనూరు, కందుకూరు గ్రామాల పాఠశాలలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, సీపీఎస్, జీపీఎస్‌ల విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ హరికృష్ణ

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలోని తాయమ్మ బైలు, బాలనాగన్న చెరువు వద్ద మంగళవారం దాడులు నిర్వహించగా అక్కడ బోయ మద్దిలేటి నిర్వహిస్తున్న నాటుసారా బట్టీని ధ్వంసం చేసినట్లు ఆదోని సెబ్ సీఐ హరికృష్ణ, ఇన్సీ ఎస్‌ఐ శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. 600 లీటర్ల బెల్లంఊట ధ్వసం చేయడంతో పాటు 10 లీటర్ల నాటుసారాను గుర్తించి నిందితుడిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అక్కడి సమీపంలోనే బోయ నాగిరెడ్డి అనే వ్యక్తికి చెందిన సారా బట్టీ వద్ద 400 లీటర్ల బెల్లం ఊట ధ్వసం చేసి, 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా పట్టణంలో బోయ తిమ్మయ్య అనే వ్యక్తి నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితులు ముగ్గురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐలు శివప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాబుసుభాని ఉరుసు

కోసిగి: స్థానిక రంగప్ప గట్టు వద్ద వెలసిన దర్గాలో మాబు సుబాని ఉరుసు మంగళవారం సాయంత్రం నుంచి ప్రారంభించారు. గ్రామ పురవీధుల గుండా జెండాను డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాలో ప్రతిష్టించారు. భక్తులు ప్రత్యేక ఫతేహాలు నిర్వహించారు. గంధం రోజున ఉత్సవాలకు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి హాజరై దర్గాలో చందా ఉసేని సమాధిని సందర్శించి ఫతేహాలు నిర్వహించారు.

నివాళి

ఆదోనిటౌన్: భారతదేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమం ఆదోనిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరాగాంధీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ కౌన్సిలర్ గోవిందరాజులు, నాగరాజు, కౌన్సిలర్ చలపతి మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలను వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తాయప్ప, గాది, ఆటోలక్ష్మన్న, షామియేల్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.



ఆదోనిలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆదోని సెంట్రల్: ఆదోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐక్యత, సమభావం కలిగి జీవించాలని సూచిస్తూ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.సంజన్న మాట్లాడుతూ.. సర్దార్ పటేల్ స్వాతంత్ర సమరంలో 565 సంస్థానాలను ఐక్యం చేసి నడిపించాడని తెలిపారు. ఆయన జీవిత విశేషాలను వివరించారు. విద్యార్థుల చేత ఐక్యత దినోత్సవంపై ప్రతిజ్ఞ చేయించారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటంతో ర్యాలీ చేపట్టిన విద్యార్థులు